# ముందు మాట

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

నిశ్చయంగా ఇస్లాం ధర్మానికి మూలాంకురాలు రెండే రెండు. దివ్య ఖుర్‌ఆన్ మరియు హదీసు. ఇవి తప్ప మూడో ప్రత్యామ్యం లేదు. ఇవి అవతరించడంలో అవిభాజ్యాలు. వాదన మరియు ఆధారం విషయంలో సమఉజ్జీలు.

సజ్జనులైన మన పూర్వీకుల్లోని సహాబా, తాబయీన్, తబ తాబయీన్లు ప్రతి చిన్న పెద్ద విషయంలో ఈ రెండు మూలాంకురాల వైపునకే మరలారు. ఆ సద్వర్తనుల బాట నడిచేవారు ప్రళయంవరకూ ఈ రెండింటినే ప్రతివిషయంలో ఆశ్రయిస్తుంటారు అనడంలో ఎలాంటి సందేహంలేదు.

హదీసు సేవల్ని అందించేవారు చాలామందే ఉన్నారు. కాని హదీసుకి వెన్నుదన్నుగా నిలిచేవారు బహు అరుదు. హదీసుకి వెన్నుదన్నుగా నిలవడం అంటే జీవితాన్ని ఖుర్‌ఆన్ మరియు హదీసులకు ప్రతి బింబంగా మలచుకోవడమే. ధర్మానికి ఈ రెండే మూలాంకురాలు అన్న నమ్మకం మరియు విశ్వాసంతో పాటు వాటి మధ్యన ఎలాంటి వైరుధ్యం లేదని నమ్మాలి ఎందుకంటే వీటిలోని ప్రతి ఒక్కటి అల్లాహ్ తరఫునుండి వచ్చినదే. ఒకవేళ అవి అల్లాహ్ తరఫునుంచి కాక ఇతరుల తరఫునుండి వచ్చి ఉంటే వాటిలోఎన్నో పరస్పర విరుద్ధమైన విషయాలు ఉండేవి.

ఈ రెండు అల్లాహ్ తరఫునుంచి వచ్చినవి అన్నవిషయంలో ఎలాంటి సందేహంలేదు. ఈ కారణంగానే అహ్లుస్సున్నహ్ వల్ జమాఅహ్ ఏకాభిప్రాయ ప్రతిపాదనమేరకు, ఎలాంటి సమస్యపరిష్కారానికయిన ఖుర్‌ఆన్ మరియు హదీసుని పూర్తిగా సంప్రదించాలి. ఇందులో ఏ ఒక్క దానిని కూడా విడవరాదు.

హదీసు-ఖుర్‌ఆన్లో పేర్కొనబడిన వాటిని, బలపరుస్తుంది లేదా దాని ఆదేశాలను విడమరచి అయినా చెబుతుంది లేదా కొన్ని ఆదేశాల విషయంలో ప్రత్యేక స్థానం గలది అయినా అయి ఉంటుంది.

ప్రవక్త (స) సత్యమే పలికారు, హజ్రత్ మిర్దాద్ బిన్ మాదీ కర్బ్ అల్ కింది (ర) గారి కథనం: ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "గుర్తుంచుకోండి! నాకు ఖుర్‌ఆన్ మరియు దానిని పోలినదే మరొకటి (హదీసు) కూడా ఇవ్వబడింది. జాగ్రత్త! ఒక కాలం రానున్నది, అప్పుడు కడుపు నిండిన (బొజ్జ గల) వాడొకడు సోఫాపై హాయిగా కొలువుదేరి – ''మీకు ఖుర్‌ఆన్ ఒక్కటే చాలు. అందులో, 'హలాల్' అని చెప్పబడిన వాటిని, హలాల్ గానూ 'హరామ్' అని తెలుపబడిన వాటిని హరామ్ గానూ భావించండి. (అంటే, హదీసు అవసరం లేదు)' అని అంటాడు. తస్మాత్ జాగ్రత్త! పెంపుడు గాడిద మీ కొరకు ధర్మసమ్మతం కాదు. అలాగే కోరలు గల మృగాల్లో ఏదీ ధర్మసమ్మతం కాదు. గుర్తుంచుకోండి! ఒడంబడిక చేసుకున్న వ్యక్తి (ఇస్లామీయ పరిపాలనా పరిధిలో నివసించే ముస్లిమేతరుని) తాలూకు క్రింద పడి ఉన్న వస్తువును హస్తగతం చేసుకోకూడదు. ఆ వస్తువు అవసరం అతనికి లేదని రూఢి అయితే తప్ప. ఒక వ్యక్తి ఓ జాతి వద్దకు ఏతెంచితే అతనికి ఆ జాతి వారు అతిథి మర్యాదలు చేయాలి. వారు చేయని పక్షంలో సదరు వ్యక్తికి వారి నుండి బలవంతంగానయినా సరే అతిథి మర్యాదలు చేయించుకునే అధికారం ఉంటుంది. (అహ్మద్)

పై హదీసులో పేర్కొనబడిన సమయం వచ్చేసింది. ప్రవక్త (స) గారి హదీసుల పట్ల అమిత శ్రద్ధ చూపపే వ్యక్తిని నేడు అల్లాహ్ మార్గంలో పోరాడే యోధునిగా అభివర్ణించవచ్చు. ఈ బాటను అనుసరించే వారిలో "మిష్కాతుల్ మసాబీహ్" గ్రంథ కర్త పండితమహాశయులు, ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ అత్తబ్రీజీ గారు మరియు ఆ గ్రంథానికి ఉర్దూ అనువాదకులయిన మౌలానా అబ్దుస్సలామ్ బస్తవీ గారు ఉన్నారు.

ఇక, గౌరవనీయులైన డాక్టర్ అబ్దుర్రహీమ్ గారు ఏ కృషి అయితే చేసారో, చేస్తున్నారో అది మహత్తరమైనదనే చెప్పాలి. డాక్టర్ గారు ఖుర్ఆన్ గ్రంథాన్ని తెనుగీకరించిన తర్వాత తెలుగు భాషలో పెద్ద వెలితిని గమనించారు. ఎందుకంటే, తెలుగు భాషలో, 'బులూగ్ అల్ మరామ్-హదీసు మకరందం, అల్ లూలూ వల్ మర్జాన్-హదీసు వెలుగు' తప్ప వేరే గ్రంథాలు అనుదించబచలేదు. ఈ యదార్థాన్ని గ్రహించిన డాక్టర్ గారు హదీసు వెలుగులతో తెలుగు ప్రజల హృదయాలను ప్రకాశమానం చేయాలన్న సదుద్దేశ్యంతో ఈ గ్రంథ అనువాదానికి పూనుకున్నారు. ఈ గ్రంథ ప్రత్యేకత ఏమిటంటే, ఇందులో ప్రతి హదీసు మొదట్లో ప్రముఖ హదీసువేత్త అల్లమా అల్బానీ (ర) గారి విశ్లేషణను సయితం పేర్కొనడం జరిగింది. ఫలితంగా ప్రతి పాఠకుడు చదివే విషయంలో గానీ, అమలు పరిచే విషయంలోగానీ ఒక స్పష్టమయిన అవగాహన కలిగి ఉంటాడు అనడంలో ఎలాంటి సందేహంలేదు. అయితే, ఇదే గ్రంథానికి సంబంధించిన కొన్ని అధ్యాయాల ఉపోద్ఘాతంలో కొన్ని బలహీన హదీసులను ఉర్దూ అనువాదకుల తరఫు నుండి ప్రస్తావించడం జరిగిందన్నది గమనార్హం. వాటని డాక్టర్ గారు అలానే ఉండనిచ్చారు. అల్లాహ్ మూల గ్రంథకర్తకు, అనువాదకులకు, ప్రచురించేవారికి ఇహ పరాల్లో మేలును చేకూర్చాలన్నది మా ప్రార్థన!

**1 / 4 / 1436 H (21-1-2015 CE)**

**డాక్టర్ సయీద్ అహ్మద్ ఉమరీ మదనీ**

**జమీయత్ అహ్లె హదీస్**

**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు**

*****